అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 16 మే 2023

వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వీవోలు

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం వివోఏల సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా భిక్కనూర్ పట్టణ కేంద్రంలో మండల వివోఏల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన చట్టం 26 వేల రూపాయలు అందజేయాలని డిమాండ్ చేశారు.

జీపీ స్థలం చదును


జేసీబీతో స్థలం చదును

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగు మర్రి తాండ గ్రామపంచాయతీకి గ్రామపంచాయతీ భవనం రూ, 20 లక్షలతో మంజూరు కాగా సోమవారం పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించి, చదును చేశారు. పంచాయతీ భవన నిర్మాణానికి కృషి చేసిన ప్రభుత్వ విప్పు గంప గోవర్ధన్‌కు గ్రామస్తుల తరఫున సర్పంచ్ స్రవంత పరమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గడ్డం గంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు
అట్టహాసంగా నిర్వహించాలి

- వివిధ శాఖలు అభివృద్ధి నివేదికలు రూపొందించాలి
- కూడళ్లు, కార్యాలయాలు అలంకరించాలి
- అధికారులతో సమీక్ష


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదవ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ప్రభుత్వపరంగా నిర్వహించ నున్న దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో అట్టహాసంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన వివిధ అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ వర్గాల వారికి చేకూర్చిన లబ్ది గురించి శాఖల వారీగా నివేదికలు రూపొందించాలని తెలిపారు. అన్ని కార్యాలయాలను అందంగా అలంకరించాలని, ట్రాఫిక్ ఐలాండ్ లు, ముఖ్య కూడళ్ల వద్ద విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, చీఫ్ మినిస్టర్స్ కప్ -2003 క్రీడా పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. 22 , 23 , 24 తేదీలలో జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీలను నాగారంలోని రాజారామ్ స్టేడియం, పాత కలెక్టరేట్ మైదానం, పోలీస్ పరేడ్ గ్రౌండ్ తదితర వేదికలుగా నిర్వహించనున్నట్టు తెలిపారు. క్రీడా పోటీల విజయవంతానికి కృషి చేయాలని తెలిపారు. కాగా, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మరో పది రోజుల పాటు గట్టిగా పని చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైస్ మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, జోన్ల వారీగా నియమించబడిన జిల్లా అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి అన్ లోడింగ్ ప్రక్రియను పరిశీలించాలని అన్నారు.

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 41 విజ్ఞాపనలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి కలెక్టరేటుకు తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, నిజామాబాద్ ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులుపాల్గొన్నారు.


సమీక్షకు హాజరైన వివిధ శాఖల అధికారులు

రైతు కన్నీళ్లు పట్టవా..?

- తడిచిన ధాన్యం కొంటామంటూనే కొంటలేరు
- క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలు పరిశీలించిన సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు
- సొసైటీలు, రైస్‌మిల్లర్లు, లారీ ఓనర్లు ములాకత్‌తో రైతులను దోచుకుంటున్నారని విమర్శ


మొలకెత్తిన ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న బీఆర్ఎస్‌కు రైతుల కన్నీళ్లు పట్టడం లేదని, తడిచిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని, పంట నష్టంపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు. సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరికొండ మండలంలోని పెద్దవాల్గోట్ లో రైతుల సమస్యల పైన, వడ్ల కుప్పలను సందర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెంచి ధాన్యం కొనుగోలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ఒకవైపు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదని అన్నారు. తడిచిన వడ్లను, మొలకెత్తిన వడ్లను, ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ఎక్కడ రైతులకు నష్టం జరగకుండా చూస్తామని ప్రచారం చేస్తూన్నారే తప్పా కానీ ఆచరణలో అలా జరగటం లేదని అన్నారు. ఒకవైపు సొసైటీ వారు, రైస్ మిల్ యజమానులు, లారీ ఓనర్లు మిలాకత్ ఐ రైతులను నిలువు దోపిడి చేస్తూ, ఇబ్బందులకు గురిచేస్తు న్నారని అన్నారు. రైతుల వద్ద నుంచి మూడు నుంచి ఐదు కిలోలు కటింగ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఐకెపి అధికారులు కూడా రైతులకు నష్టం చేకూర్చే ఆలోచన చేస్తూన్నారని తెలిపారు.

సిరికొండ మండల కేంద్రంలో పెద్ద వాల్గోట్ రైతుని వ్యక్తిగతంగా, కక్షతో సొసైటీ డైరెక్టర్ రాములు వారి వడ్లను కొనకుండా, నెల రోజులుగా అక్కడే ఉంచడం జరిగిందని, ఆ గ్రామంలో ఉన్న రైతులందరి ధాన్యం కొనుగోలు చేసి, ఇతనివి మట్టుకు కొనుగోలు చేయలేదని, దీనిపైన సొసైటీ చైర్మన్ గంగారెడ్డి ని కలిసినట్టు తెలిపారు. వెంటనే ఆయన స్పందించి రెండు రోజులలో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వము, అధికారులు, రైతుల సమస్యలను పరిష్కారం చేయాలని లేని పక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం మోహన్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సుమన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కాలేజీ గంగారం, నరేష్ వడ్డే, బక్కన్న, గడ్డం ముత్తన్న, కురుమ లింగన్న, చిట్యాల గంగారం, సయ్యద్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

మా మహిళా భవనం మాకే కావాలి

- పెర్కిట్ జాతీయ రహదారిపై రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న మహిళలు

నవతెలంగాణ-ఆర్మూర్

మా మహిళా భవనం మాకే కావాలి అంటూ పట్టణంలోని పెర్కిట్ జాతీయ రహదారిపై సోమవారం మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించినారు. పెర్కిట్ -కొటార్మూర్ గల గ్రామ మహిళ సంఘ భవనం ప్రహరీ ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు కూల్చివేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా సంఘ భవనంలో గతంలో ప్రజల సౌకర్యం కోసం ఆరోగ్య కేంద్రం సేవలకై ఒక గదిని కేటాయించినట్టు తెలిపారు. ఆ గదికి పల్లె దావఖాన పేరుతో ఆరోగ్యశాఖ అధికారులు బోర్డు పెట్టుకున్నారని మహిళ సంఘాల సభ్యులు మండిపడ్డారు. ఎలాంటి సమాచారం లేకుండా ప్రహరిని కూల్చివేయడం పట్ల అధికారులపై, నాయకులపై మహిళ సంఘ సభ్యులు మండిపడ్డారు. జాతీయ రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు.

స్థానిక ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి కుల సంఘాలకు ,స్వచ్ఛంద సంస్థలకు ఇస్తున్న 10 శాతం స్థలాల మాదిరిగా బస్తీ దావఖానాకు సైతం స్థలం మంజూరు చేయాలని కోరారు. మహిళా సంఘ భవనం ఆవరణలో మరో భవనం నిర్మిస్తామంటూ వస్తే ఊరుకునేది లేదని మహిళా సంఘాల అధ్యక్షురాలు రూప చేపూరు విజయ, రాజగంగులు తెలిపారు. జాతీయ రహదారిపై అరగంటసేపు మహిళలు రాస్తారోకో చేయడంతో ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న మహిళలకు సర్ది చెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ కార్యక్రమంలో మెరుగు లలిత, కమల, సుజాత మహిళ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లమెంటరీ ఫీజుకు నేడే ఆఖరు

- రీవాల్యుయేషన్, రీ కౌంటింగ్‌కూ ఫీజు చెల్లించొచ్చు

నవతెలంగాణ-రామారెడ్డి

ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరంలో ఫెయిల్ అయిన విద్యార్థులు, సప్లమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించేందుకు నేడే చివరి తేదీఅని రామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాత్సవ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం 5 గంటల వరకే గడువు ఉన్నందున విద్యార్థులు సకాలంలో వచ్చి ఫీజు చెల్లించుకోవాలని సూచించారు. అలాగే ఇంటర్మీడియట్ ఫలితాలపై రీకౌంటింగ్, రివాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు సైతం నేడే ఆఖరు తేదీ అని అవసరమున్న విద్యార్థులు ఫీజు చెల్లించాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాత


మృతిచెందిన గేదె మృతి

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యుత్ షాక్ తో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని సింగరాయపల్లిలో చోటుచేసు కుంది. స్థానికులు, బాధితుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అన్నేబోయిన అంజయ్యకు చెందిన గేద, పంట పొలాల్లో బోరు మోటర్‌కు వచ్చే వైరు, ప్రమాదవశాత్తు కొమ్ములకు తగిలి, విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. గేద విలువ రూ, 60వేలు ఉంటుందని, పాడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి చేసింది.

రేపే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

- పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 17న పాలిటెక్నిక్ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఉంటుందని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు అనుమతి ఇస్తారని చెప్పారు.

జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్ ఆర్ కె, సాందీపని, మంజీరా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం 2514 మంది పరీక్ష రాస్తున్నారని తెలిపారు. వీరిలో బాలికలు 1202, బాలురు 1312 మంది పరీక్షలు రాస్తున్నారని చెప్పారు. విద్యార్థులు హాల్ టికెట్, హెచ్ బి పెన్సిల్, పెన్ను, ఎరేజర్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 11 గంటల తర్వాత ఒక నిమిషం అలస్యమైన పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి లేదని చెప్పారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, మద్నూర్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని కలెక్టర్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాలీసెట్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కిష్టయ్య, సంయుక్త సమన్వయకర్త శంకరయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు చంద్రకాంత్, మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సురేష్ గౌడ్, సాయిబాబా, జిల్లా విద్యాధికారి రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్ మోజులో కన్నతల్లిపై హత్యాయత్నం



ఇంటికి నిప్పు పెట్టడంతో ఎగిసిపడుతున్న మంటలు... ఇన్‌సెట్‌లో తల్లి చంద్రవ్వ

- అప్పు ఎక్కువ కావడంతో ఇల్లు, భూములు అమ్మేందుకు యత్నం
- అడ్డుకుంటున్న తల్లిని వదిలించుకునేందుకు ఇంటికి నిప్పు పెట్టిన తనయుడు
- అప్రమత్తమై బయటకు వచ్చేయడంతో తప్పిన ప్రాణాప్రాయం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నవమాసాలు మోసి, పురిటి నొప్పులు భరించి జన్మనిచ్చిన ఓ కన్నతల్లిని కేవలం తన సరదాలకు, బెట్టింగ్‌ల కోసం చేసిన అప్పులకు అడ్డు చెప్పిందన్న అక్కసుతో చంపాలనుకున్నాడో కొడుకు. ఆమెను ఇంట్లోనే ఉంచి ఇంటికి నిప్పు పెట్టాడు. ఆమె బయటకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన బీర్కూరు మండలం కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం..

బీర్కూరు మండల కేంద్రానికి చెందిన గవ్వల చంద్రవ్వకు ఒక కొడుకు గవ్వల అశోక్. తన సరదాలకు చేసిన అప్పులను తీర్చడం కోసం ఆస్తి విక్రయంలో తల్లి అడ్డు వస్తుందనే అక్కసుతో తల్లి ఇంట్లో ఉన్న విషయం తెలుసుకొని ఇంటికి పెట్టాడు. చంద్రవ్వ ఇంటి నుంచి బైటికి రావడంతో ఆమె ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నది. చంద్రవ్వకు ఒకే కొడుకు అశోక్‌ను ఉన్నత చదువలు చదివించింది. పెళ్లి చేసింది. గతంలో బీర్కూర్ లో కొన్ని రోజులు అన్ లైన్ వ్యాపారం చేశాడు. అప్పులు పెరగడంతో భార్య పిల్లలతో హైదరాబాద్ వెళ్ళాడు అక్కడ ఓ ప్రైవేట్ కంపెనీలో సూపర్వైజర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. అన్ లైన్ బెట్టింగ్ మోజులో పడి అప్పుల పాలయ్యాడు.

దీనితో అప్పులు పెరిగాయి. అప్పులు ఇచ్చినవారు తిరిగి చెల్లించాలంటూ ఒత్తిడి చేయడంతో చేసేది ఏం లేక వ్యవసాయ భూమి, ఇల్లు విక్రయించాలని తల్లిని ఒత్తిడి చేశాడు. ఎట్టి పరిస్థితుల్లో ఇల్లు విక్రయించేది లేదని చెప్పడంతో అక్కసు పెంచుకున్నాడు. తల్లి కొడుకులు కొన్ని రోజుల నుంచి మాట్లాడుకోవడం లేదు. సోమవారం ఉదయం ఇంట్లో తల్లితో గొడవ పెట్టుకున్నాడు ఫర్నిచర్, టీవీ, బీరువా పగలగొట్టాడు. మధ్యాహ్నం తల్లి అడ్డు చెప్పడంతో తన సరదాలకు అడ్డు వస్తుందని ఆవేశంతో ఇంట్లో తల్లి ఉన్న విషయం తెలుసుకొని గ్యాస్ సిలిండర్ ఓపెన్ చేసి నిప్పు అంటించాడు. మంటలు చెలరేగడంతో తల్లి బయటికి వచ్చింది. మంటలు చెలరేగి పక్కనే ఉన్న కిరాయి ఉన్న ఇంటిలోకి మంటలు చెలరేగాయి. గ్యాస్ సిలిండర్ పేలడంతో పెద్ద శబ్దం వచ్చింది.

చంద్రవ కేకలు పెట్టడం, అశోక్ పరిగెత్తడం చూసిన జనం ఆందోళన చెందారు. మంటలు ఎక్కువ కావడంతో అగ్నిమాపక కేంద్రం సమాచారం ఇవ్వడంతో వెంటనే అగ్నిమాపక కేంద్రం వచ్చి మంటలను ఆర్పి వేసింది. ఈ మంటల్లో 8 తులాల బంగారం లక్షన్నర నగదు, వెండి కాలి బూడిద అయినట్లు చంద్రవ్వ తెలిపింది. అలాగే అదే ఇంట్లో కిరాయి ఉంటున్నా కిరాయిదారుల నిత్యవసర వస్తువులు, ఫర్నిచర్ కాలిపోయినట్లు కిరాయిదారులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థానం చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాల్ రెడ్డి తెలిపారు.

టీయూ రిజిస్ట్రార్ గదికి తాళం

- కామర్స్ విభాగంలో కూర్చున్న రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి
- త్వరలో టీయూ నుండే నూతన రిజిస్ట్రార్ నియమించనున్నట్టు వీసీ ప్రకటన
- మళ్లీ మొదటికి వచ్చిన వివాదం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



టీయూతో తాలం వేసి ఉన్న రిజిస్ట్రార్ గది

తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కుర్చీ ఖిస్సా ఇంకా సమసి పోలేదు. తాజాగా సోమవారం రిజిస్ట్రార్ గదికి తాళం దర్శణమిచ్చింది. రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ యాదగిరి బాధ్యతలు స్వీకరించి నాటి నుండి వైస్ ఛాన్సలర్‌కు పోసగడం లేదని ఆరోపణలు న్నాయి. సోమవారం ఉదయం యూనివర్సిటీలోని పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్న ప్రొఫెసర్ యాదగిరి తన గదికి తాళం ఉండడం గమనించి వెంటనే కామర్స్ విభాగానికి వెళ్లిపోయి అక్కడే కూర్చున్నారు. ఉదయమే యూనివర్సిటీకి చేరుకున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యూనివర్సిటీలో జరిగే అన్ని అంశాలపై అకాడమిక్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కౌంటర్ సంతకం పెట్టే విధంగా ఆదేశాలు జారీ చేశారు. వైస్ ఛాన్సలర్‌కు ముందస్తు సమాచారం లేకుండా ఏలాంటి ఫైలు అనధికార వ్యక్తికి ఇవ్వొద్దని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైస్ ఛాన్సలర్ రవిందర్ ఆదేశాలు జారీ చేశారు.

సోమవారం తెలంగాణ యూనివర్సిటీ లో రిజిస్ట్రార్ కార్యాలయం గదికి తాళం వేసిన విషయం తెలుసుకున్న విలేకరులు అక్కడికి చేరుకొని వైస్ ఛాన్సలర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతమున్న రిజిస్ట్రార్ ఎవరో అంతు పట్టడం లేదని, ఈసీ సభ్యులు నియమించిన రిజిస్ట్రార్‌కు ఎలాంటి అపాయింట్మెంట్ లెటర్ లేదని ఆయన వివరించారు. రిజిస్ట్రార్ నియామకంలో అనవసర రాద్ధాంతం జరిగిందని, ఎవరు రిజిస్ట్రార్ ఓ తేలలేక నియామకం రద్దును హైకోర్టు నిలిపివేసిందని వైస్ ఛాన్సలర్ పేర్కొన్నారు. అందువల్ల రిజిస్ట్రార్ నియామకం అయ్యే వరకు కార్యాలయానికి సీలు వేసి యథావిధిగా పనులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీలోనే అనుభవజ్ఞులైన ఒక ప్రొఫెసర్‌ను నూతన రిజిస్ట్రార్‌గా యునివర్సిటీ ఈ.సి. కమిటీ సభ్యుల నిర్ణయంతో నియామకం చేపడతామని తెలిపడం గమనార్హం. జూన్ 1న తెలంగాణ యూనివర్సిటీలోనే తాను ఈసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహిస్తానని వీసీ రవీందర్ తెలిపారు. రిజిస్ట్రార్, వైస్ ఛాన్సలర్ మధ్య కుర్చీ వివాదం రోజుకో మలుపు తిరుగుతూ దుమారాన్ని లేపుతుంది. వాయిస్ ఛాన్సలర్ మాత్రం పట్టిన పట్టును విడిచేది లే అన్న చందంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కారు ఢీ కొని యువకుడి మృతి


మృతిచెందిన సంజీవ్ షా

నవతెలంగాణ-దోమకొండ

కారు ఢీ కొని యువకుడి మృతి చెందిన సంఘటన దోమకొండలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామం నుండి గ్రామానికి చెందిన లచ్చు గారి శ్రీరాం బైక్ పై బీహార్ రాష్ట్రానికి సంజీవ్ షా(25) ధాన్యం కొనుగోలు కేంద్రంలో కార్మికునిగా పని నిమిత్తం వచ్చారు. పని ముగింపు చేసుకొని లింగుపల్లి గ్రామం నుండి రాత్రి దోమకొండ గ్రామనికి వచ్చే దారిలో అంచనూరు గ్రామానికి చెందిన దినేష్ కారు బైక్ ను ఢీ కొట్టడంతో సంజీవ్ షాకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నూతన పాలక వర్గానికి లిఫ్ట్ బాధ్యతలు అప్పజెప్పాలి

ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రొఫెసర్ జయశంకర్ గుమ్మిర్యాల్ ఎత్తిపోతల పథకం(లిఫ్ట్)కు సంబంధించి నూతన పాలక వర్గానికి పదవీ బాధ్యతలు అప్పజెప్పాలని చైర్మన్‌గా ఎన్నికైన సోమా రాజారెడ్డి, పాలకవర్గం సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ...నూతన పాలక వర్గాన్ని 1995 యాక్ట్ ప్రకారం ఎన్నుకున్నామని, మహాజన సభ సైతం నిర్వహించుకొని తీర్మానం చేసుకున్నామని చెప్పారు. పాత చైర్మన్ పదవీకాలం 7-12-21 నాటికి ముగిసిపోయినా.. కొత్త పాలకవర్గానికి ఆయన బాధ్యతలు అప్పజెప్పడం లేదని అన్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని మాకు బాధ్యతలు అప్పజెప్పేలా మార్గదర్శకాలు ఇప్పించాలని కోరారు. కలెక్టర్‌కు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులో పాత చైర్మన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు అధికారులకు ఇచ్చిన లేఖను సైతం జతచేసి అందించారు.

ట్రస్టు డబ్బులకు ఐటీ నుండి మినహాయించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ట్రస్టు డబ్బులకు ఐటీ నుండి మినహాయించాలని సిద్ధిరాములు, ఏఎస్ పోశెట్టి కలెక్టర్‌కు ప్రజావాణిలో విన్నవించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 2021లో గుజరాత్ లో భూకంపం రావడం వల్ల అనేక మంది చనిపోవడమే కాకుండా కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందన్నారు. వారిని ఆదుకోవడంకోసం బీడీ యాజమాన్యం తెలంగాణ రాష్ట్రంలో బీడీ కంపెనీల్లో లక్షల రూపాయల చందాలు వసూలు చేశారన్నారు. గుజరాత్ భూకంప బాధితులకు బీడీ యాజమాన్యం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటి 20 లక్షలకుపైగా ఉన్న డబ్బులపై ఐటీ డబ్బు కట్టాలని నోటీసు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఈ డబ్బులను ఐటి నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వెంకటి, బాలరాజు, స్వామి, బీడీ యాజమాన్యం పాల్గొన్నారు

పనుల్లో రాజీపడం.. నాణ్యతతో చేయిస్తాం

- **నవతెలంగాణ కథనం ఎఫెక్ట్**
- **ప్రహారీ నిర్మాణ పనుల పరిశీలించిన అర్అండ్‌బి డీఈ సుధీర్**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నవతెలంగాణ దిన పత్రికలో సోమవారం ప్రచురితమైన నాణ్యత నీ చిరునామా ఎక్కడ అనే కథనానికి కలెక్టర్ జాయింట్ కలెక్టర్ వెంటనే స్పందించి పనులను పరిశీలించి నివేదికను అందజేయాలని ఆర్అండ్‌బి శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బి డీఈ సుధీర్, ఎంపీడీవో రాములు నాయక్, ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణ సోమవారం ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పలుచోట్ల వర్షాల కారణంగా వచ్చిన వరద నీటితో కొట్టుకుపోయిన గోడను పరిశీలించి కాంట్రాక్టర్ను వెంటనే నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేసిన పనులకు గాను ఇప్పటికీ డబ్బులు చెల్లించలేదని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ప్రత్యేక తీసుకుంటున్నామని అన్నారు. ముందుగా అగ్రిమెంట్ ప్రకారమే పనులను చేస్తున్నామన్నారు. పాఠశాల మైదానంలో మొరం పనులకు మన ఊరు మనబడి కింద మంజూరు కాలేదని గ్రామపంచాయతీ నిధుల నుండి మొరం వేయడం జరుగుతుందన్నారు. ముందుగా ప్రహారీ గోడ నిర్మాణం పనులు పూర్తయిన తర్వాతనే మొరం వేసేది ఉండగా ముందుగా వేయించడం కరెక్ట్ కాదన్నారు. మూత్రశాలలు మరుగుదొడ్ల వద్ద వేసిన మొరం మైదానం నలువైపులా ఒక లేవల్లో వస్తుందని, దాన్ని పైకి లేపి మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇంకా రెండు మరుగుదొడ్లు మంజూరయ్యాయని వాటి స్థానంలో కొత్తగా నిర్మాణం చేపడతామన్నారు. నాణ్యత లేకుండా ఏ పనులు చేసిన దానికి బిల్లులు చెల్లించబోమని నిబంధనల ప్రకారమే పనులు చేయవలసి ఉంటుందనిడీఈ సుధీర్ పేర్కొన్నారు. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే వారి బిల్లులను నిలుపుదల చేయనున్నట్లు చెప్పారు. నివేదికను అదనపు జాయింట్, కలెక్టర్‌కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో ప్రస్తుతం మన ఊరు కింద కొనసాగుతున్న పనులను పర్యవేక్షిస్తూ జూన్ నెల 12 కల్లా పూర్తిగా పనులు చేసే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. పనుల్లో రాజీ పడేది లేదని, నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే వారి బిల్లులను నిలుపుదల చేపడతామన్నారు. సర్పంచ్ పాశం సత్తెవ్వ నర్సింలు, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ వీడీసీ చైర్మన్ నామాల గంగాధర్ తోపాటు తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న అధికారులు

రాష్ట్రీయ జిల్లా పంచాయత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా విఠల్ రావు



జడ్పీ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఐఎంఏ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రాష్ట్రీయ జిల్లా పంచాయత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా, సెంట్రల్ లో ఉపాధ్యాక్షులుగా జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావును నియమిస్తూ సెంట్రల్ వ్యవస్థాపక అధ్యక్షులు కైలాస్ గోరె పాటిల్ నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జడ్పీ కార్యాలయం లో ఆయనను ఐఎంఏ అధ్యక్షులు సతీష్‌షా, కార్యదర్శి డాక్టర్ విశాల్ కార్యవర్గ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ శంకర్, శేఖర్ రెడ్డి, శేఖర్ రాజ్, నీలంరెడ్డి, మనోహర్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈ అసోసియేషన్ ఏర్పడిందని, దీని ముఖ్య ఉద్దేశం 72, 73 రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం స్థానిక సంస్థలకు రావలసిన అధికారాలు, విధులను సాధించుటకు ఏర్పడిందని అన్నారు. త్వరలో ఢిల్లీలో 29 శాఖలు స్థానిక సంస్థలకు బదలాయించు విషయమై అసోసియేషన్ సమావేశం అవుతుందని తెలిపారు.

తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది

జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్



నవతెలంగాణ-ధర్పల్లి

రాష్ట్రంలోని తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. సోమవారం మండలంలోని ఇంద్రనగర్ తండా, బిల్యా తండాల్లో నూతన పంచాయతీ పక్క భవనానికి భూమి పూజ చేశారు,ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయటం జరుగుతుందని అన్నారు, కేసీఆర్ వచ్చాక తండావాసులకు ఇబ్బందులు తొలగి తండాలు అభివృద్ధి పథంలో కొనసాగుతున్నాయని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ నుండి ఒక్కొక్క పంచాయతీ భవనానికి 20 లక్షలు మంజూరయ్యారని, వాటికి భూమిపూజ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. రానున్నరోజుల్లో రాష్ట్రంలోని గిరిపుత్రులు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సొసైటీ చేర్మెన్ మల్లికార్జున్,గోపాల్ నాయక్,శంకర్ నాయక్,శ్రీనివాస్ నాయక్,బీల్యా తండా శంకర్ నాయక్, గోపీచంద్, మోహన్ నాయక్, బాలు నాయక్, రాజ్పాల్ రెడ్డి, సుభాష్, పోత రాజు, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు కనీస వేతనం అమలు చేయాలి

- **ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి దేవారం**
- **తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన వీవోఏలు**



ఆర్మూర్‌లో...

నవతెలంగాణ- ఆర్మూర్/కోటగిరి/ఎడపల్లి

ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం అమలు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి దేవారం అన్నారు.. డిమాండ్ల సాధన కోసం గత 22 రోజులుగా సమ్మె చేస్తున్న వీవోఏల సమ్మెకు సోమవారం మద్దతు తెలిపారు. ఈసందర్భంగా బి.దేవారం సబ్ డివిజన్ కార్యదర్శి బి.కిషన్ మాట్లాడుతూ... 22 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తుంటే స్పందించకపోవడం ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని తెలియజేస్తుందన్నారు. విధుల్లో చేరకుంటే సీరియస్ పరిణామాలు ఉంటాయని బెదిరించడం సిగ్గుచేటన్నారు. వెంటనే వీఓఏల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వీవోఏలకు నెలకు 10,500 రూపాయలు గౌరవ వేతనం ఇస్తుండగా, తెలంగాణ రాష్ట్రంలో నెలకు కేవలం 3900 ఇవ్వడం దుర్మార్గమన్నారు. డిమాండ్లు సాధించేవరకు ఉద్యమాన్ని కొనసాగించాలని అన్నారు. సమ్మెలో సబ్ డివిజన్ నాయకులు నరేందర్, రాజన్న, గంగన్న, ఇఫ్ట్ నాయకులు ఎం.డి నజీర్ రాజు పాల్గొన్నారు.

కోటగిరి:మండలంలో 22వ రోజు నిరవధికంగా ఈవోఏల సమ్మె కొనసాగుతుంది . కనీస వేతనం 18వేల రూపాయలు అమలు చేయాలని, నామమాత్రపు జీతాలతో నానా రకాల అవస్థలు గురవుతున్నామని, పెరిగిన నిత్యావసర సరుకులు , పిల్లల చదువులు కష్టంగా మారాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

ఎడపల్లి:వీవోఏల సమ్మెలో భాగంగా సోమవారం ఎంపీపీ కే శ్రీనివాస్‌కు, తహసీల్దార్ ఆకుల శేఖర్‌కు వేరువేరుగా పత్రాన్ని సమర్పించారు. 15ఏండ్లుగా ఐకేపీలో క్రమంగా విధులు నిర్వహిస్తూ మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్ల పరిష్కారంలో విఫలమైందని మహిళలు ఆరోపించారు. కనీస వేతనం 20వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రతతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పోచయ్య, సుదర్శన్, లత, మంజుల, కుమ్మరి పుష్ప, సంధ్య, శోభ, కొమురవ్వ యూసఫ్, ఆయా గ్రామాల ఓబిలు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.



కోటగిరిలో..

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను శిక్షించాలి

- **బోధన్‌లో ఆర్డీవో కార్యాలయం ఎదుట, నిజామాబాద్‌లో కలెక్టర్ కార్యాలయం ఎదుట పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ధర్నా**

నవతెలంగాణ-బోధన్/నిజామాబాద్‌సిటీ

రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషన్‌ను తక్షణమే భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్ష పదవి నుంచి తొలగించి, చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ప్రగతి శీలత మహిళ సంఘం(పీఓడబ్ల్యు) బోధన్ పట్టణ అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టి కార్యాలయ పాలనాధికారి ముంతాజుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు అయిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, క్రీడాకారిణిలపై లైంగికంగా వేధింపులకు పాల్పడడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఢిల్లీలో గత నెల రోజులుగా మహిళా క్రీడాకారిణిలు ఆందోళనలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఆయన్ను పదవులనుంచి తొలగించి, విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా నాయకులు బిపాషా బేగం, పట్టణ నాయకులు డి. లక్ష్మి, రెహానా, థమ్సీ బేగం, లక్ష్మీ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.



బోధన్: ఎమ్మెల్యే సతీమణి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఎమ్మెల్యే సతీమణి ఆధ్వర్యంలో ర్యాలీ...

భారత మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేసి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ బోధన్ పట్టణంలో కళాశాల విద్యార్థులతో కలిసి బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ సతీమణి ఆయేష ఫాతిమా కొత్త బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను దేవతలుగా పూజించే భారతదేశంలో ఇలా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. ఎంపీ బ్రిజ్ భూషణ్ ను తక్షణమే పదవుల నుంచి తొలగించి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కరాటే క్రీడాకారిణి మల్లెపూల పల్లవి, జడ్పీ వైస్ చైర్మన్ రజిత యాదవ్, మహిళలు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ :రెజ్లింగ్ క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను తక్షణమే బాధ్యతల నుండి తొలగించి, చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని, ఎంపీ పదవి నుండి బర్తరఫ్ చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ కి వినతి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నాటి సంధ్య మాట్లాడుతూ.. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షులుగా కొనసాగుతున్న బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై గతంలోనే అనేక కేసులు, ఫిర్యాదులు ఉన్నాయని అన్నారు. క్రీడాకారులపై బహిరంగంగానే వివాదాస్పదంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బ్రిజ్ భూషణ్‌ను వెనుకేసుకరావడం వల్ల మహిళా క్రీడాకారులపై ఆగడాలు మరింత తీవ్రమయ్యాయని తెలిపారు. 20 రోజుల నుండి భారత రెజ్లింగ్ క్రీడాకారులు ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా ఉద్యమిస్తున్నారని అన్నారు. ప్రధాని మోడి, క్రీడాశాఖ మంత్రులు కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్ గౌర, నాయకులు లలిత, లక్ష్మి ,శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే సీఎం కప్ లక్ష్యం



నవీపేట్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

నవతెలంగాణ-నవీపేట్/భీంగల్

గ్రామీణ ప్రాంతాల్లో యువ క్రీడాకాలను ప్రోత్సహించడమే సీఎం కప్ లక్ష్యమని ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని సీఎం కప్ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో వీర్ సింగ్ ఎంపీడీవో సాజిద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న, ఎంపీటీసీలు మీనా నవీన్ రాజ్, రాధా, ఎంపీఓ రామకృష్ణ, ఏపిఎం భువనేశ్వర్ గౌడ్, ఏపిఓ రాజేశ్వర్, పిఈటి లు రవి, నాయక్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

భీంగల్:క్రీడలు మానసికోల్లాసంతో పాటు దేహదారుడ్యానికి దోహదం చేస్తాయని జెడ్పీటీసి చౌటపల్లి రవి అన్నారు. మండలంలోని బాబాపూర్ గ్రామంలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను యంపిడివో రాజేశ్వర్‌తో కలిసి ప్రారంబించారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మోయిజ్, తహసీల్దార్ శ్రీధర్ కుమార్, ఎంఈఓ స్వామి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, ఎంపిటీసి సుర్జీల్, పీడీ గోపిరెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో ప్రజల కష్టాలు తీర్చిన మహనీయుడు కేసీఆర్

ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి



ధర్పల్లిలో..

నవతెలంగాణ-ధర్పల్లి/కోటగిరి

కంటి వెలుగుతో సామాన్య ప్రజల కష్టాలు తీర్చిన మహనీయుడు కేసీఆర్ అని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సీతాయిపేట్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ లోక్కిడి విజయ రాములుతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పల్లె ప్రజలు కంటి సమస్యలపై పట్టణాలకు పోవలసిన అవసరం లేకుండా ఉచిత మందులతోపాటు అవసరం ఉన్న వారికి కంటిఅద్దాలను అందించి ప్రజలను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిశాంత్, కార్యదర్శి తిరుపతి, వైద్య బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

కోటగిరి:మండలంలోని యాద్గార్ పూర్ గ్రామంలో వారం రోజుల నుండి కంటి వెలుగులో కంటి చికిత్సలు అందజేశారని సర్పంచ్ మీర్జాపూర్ విజయ సాయన్న పేర్కొన్నారు. కంటి వెలుగులో పాల్గొన్న సిబ్బందికి సన్మాన కార్యక్రమం సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్. శ్రీలత, డిఈఓ జ్యోతి, రాజేశ్వరి హెల్త్ సూపర్వైజర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి ఎం. సునంద, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు మీర్జాపురం చిన్న సాయన్న, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కోటగిరిలో

ధరణితో ఇబ్బందులు తీరలే

- **నిజామాబాద్‌కు చేరిన అధ్యయన బస్సుయాత్ర**

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధరణి పోర్టల్‌పై సాదిక్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చేపట్టారు. హైకోర్టు న్యాయవాది, సామాజికవేత్త సాధిక్ ఆధ్వర్యంలో ధరణిపై ప్రజాక్షేత్రంలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై 33 జిల్లాల్లో సమగ్ర అధ్యయనం చేపట్టారు. అందులో భాగంగా నిజామాబాద్ నగరానికి ఈ యాత్ర చేరింది. కలెక్టరేట్ వద్ద ఆయన మాట్లాడుతూ..ధరణి పోర్టల్‌లోని సమస్యలను వివరించారు. మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా ప్రజలు అందుబాటులోకి రాకపోవడం ద్వారా ఏర్పడిన సమస్యలు ఎక్కడికి పోయి పరిష్కరించాలో తెలియని పరిస్థితులు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2020లో ధరణి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ ఆర్ఓఆర్ చట్టంలో పేర్కొన్న సకాలంలో పూర్తి కాకపోవడంతో భూమి యాజమాన్యాలు, రైతులు కోర్టులచుట్టూ తిరుగుతున్నా కనీసం భూమి వివాదాలు, కొనుగోలు సర్టిఫైడ్ కాపీలను తీసుకోవడం కూడా సరైన అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ సమస్యపై క్యాబినెట్ సబ్ కమిటీ నియమించినప్పటికీ మార్పులు చేర్పులు చేయడంలో ఆలస్యం అవుతుందన్నారు. ధరణిపట్ల ప్రజల అభిప్రాయాన్ని, ఎటువంటి మార్పు కోరుకుంటున్నారు.. ఎటువంటి సమస్యలను ఎదుర్కొంటున్నారనిసాదిక్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ హైకోర్టు న్యాయవాది సాధిక్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా యాత్రను చేపట్టామన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాల అభిప్రాయాలను అందించడానికి మినీ బస్సు యాత్రను చేపట్టారు ప్రజాసంఘాలు, రైతు సంఘాలు, ధరణిలోపనిచేస్తున్న ఉద్యోగులను కలిసి వారి అభిప్రాయం, ఆలోచనలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ఈ యాత్ర చెప్పట్టినట్టు ఆయన తెలిపారు



టీయూలో అవినీతి, అక్రమాలు, నియామకాలపై

న్యాయ విచారణ జరిపించండి

- **గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్‌ను కలిసిన బీజేపీ నాయకులు**

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ గుప్తా అవినీతి వ్యవహారాలు, అక్రమ నియామకాలపై రిటైర్డ్ జడ్జి ద్వారా న్యాయవిచారణ జరపాలని కోరుతూ సోమవారం ప్రత్యేకంగా కలిసి గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్‌ను కలిశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నిజామాబాద్ రూరల్ ఇంచార్జీ కులచారి దినేష్ కుమార్ అధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అన్ని విషయాలు విన్న గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు దినేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పద్మా రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్, వైస్ ఎంపిపి శ్యామ్ రావు, మండల అధ్యక్షులు వెంకటరమణ , ఏస్సీ మోర్చ జిల్లా ఉపధ్యక్షులు ప్రతాప్, జిల్లా ఐటీ సెల్ కో కన్వీనర్ నవీన్ కుమార్ ఉల్లెంగ, చంద్ర కాంత్, చౌకీ విష్ణు, విద్యార్థి నాయకులు గజేందర్, నవీన్, సాయికుమార్, సాయికృష్ణ మల్లికార్జున్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంటి వెలుగు ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 10 వ వార్డులో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు లో కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రజలు అందరూ కంటి వెలుగు పథకాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్, నిల కంఠం, మున్సిపల్ కమిషనర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వెండి పూలహారం విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధికి బిచ్కుంద పట్టణానికి చెందిన మహిపతి జయలక్ష్మి సుమారు అర కిలో వెండితో తయారుచేసిన పూలహారాన్ని ఆలయ ఈవో శ్రీధర్ కు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందజేసిన భక్తుడిని శాలువాతో సత్కరించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాజేశ్వర శర్మ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.


వెండి పూలహారం వితరణ

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే క్రీడలు

- అట్టహాసంగా సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం
- రేపటి వరకు మండల స్థాయిలో ఆటలు

నవతెలంగాణ-విలేకరులబృందం

యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ముఖ్యమంత్రి కప్ పేరుతో మండలాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. 15 నుంచి 17వరకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించనుండగా.. ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీ బాల్ పోటీలను రేపటి వరకు ఉదయం 7 నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్నారు.

నసురుల్లాబద్ : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపిపి పాల్త్య విఠల్ , మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్ కలసి ప్రారంభించారు. ఎంపిపి మాట్లాడుతూ క్రీడ పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపుకు నాందిని , భవిష్యత్‌లో మరిన్ని జాగ్రత్తలతో విజయం కోసం కృషి చేయాలన్నారు. క్రీడలతో యువతలో స్నేహభావం పెంపొందుతుందన్నారు.

బీర్కూరు మండలం కేంద్రంలోని ముఖ్యమంత్రి క్రీడలను ఎంపీపీ రఘు ఎంపీడీవో భాను ప్రకాష్ వివిధ గ్రామాల సర్పంచులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ నెంబర్ మజీద్ ఎంపీడీవోలు సుబ్రహ్మణ్యం, భాను ప్రకాష్ ,ఎంపీఓ రాము , వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పేరు తేవాలి : కలెక్టర్

లింగంపేట్ : లింగంపేట్ మండలం క్రీడాకారులు క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయిలో పేరు తేవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆటల పోటీలు ఎంతో ఆరోగ్యకరమైనవి అని అన్నారు. ఈనెల 22 నుండి జిల్లా స్థాయి పాటల పోటీలు ప్రారంభం అవుతాయని తెలిపారు. పోల్కంపేట్ గ్రామ సర్పంచ్ మనిగిరి పద్మ నాగరాజు క్రీడ నిర్వాహకులు పీఈటీలకు కలెక్టర్ చేతుల మీదుగా డ్రెస్సులను, టీ షర్టులను అందించారు. కార్యక్రమంలో గరీబున్నీసా నయీమ్, సర్పంచుల లావణ్య, జెడ్పిటిసి శ్రీలత సంతోష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శమిమున్నిసా, ఎఎంసి వైస్ చైర్మన్ సిద్దిరాం రెడ్డి, డిఎల్‌పిఓ సురేందర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, తహశీల్దార్ చంద్ర రాజేశ్వర్, ఎంపీఓ ప్రభాకరాచారి, ఎంఈఓ రామస్వామి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, లింగంపేట్ సొసైటీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రమేష్, వైస్ ఎంపీపీ విట్టల్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు రాజయ్య, ఎఎంసి డైరెక్టర్ ఫాతియొద్దీన్, రెడ్ క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

క్రీడా పోటీలు ప్రారంభం

సదాశివనగర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. మండలంలో గెలుపొందిన వారికి మెమోంటోలు, సర్టిఫికెట్ అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గైని అనుసూయ, వైస్ ఎంపిపి గాదారి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, శంఖర్, సాయిలు జడ్పీటీసీ కమిలి నర్సింలు, మండల బీఆర్‌యస్ అధ్యక్షుడు బొలిపెల్లి మహేందర్ రెడ్డి, తహశీల్దార్ ధన్వల్, ఎం.పి.డి.ఓ లక్ష్మీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, ఎం.ఈ.ఓ యూసఫ్ శీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ప్రారంభం

గాంధారి: గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడలు ఉదయం 9.00 గంలకు ఎంపీపీ రాదాబలరాం అధ్యక్షతన ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ నాయక్, ఏఎంసి చైర్మన్ సత్యం రావు, ఏఎంసి చైర్మన్‌రెడ్డి రాజులు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, ఎంపీటీసీ పత్తి శ్రీనివాస్, పెద్ద గుజ్జుల్ తాండ సర్పంచ్ దేవి సింగ్,ఎంపీడీఓ సతీష్ కుమార్, ఎం.ఆర్.వో గోవర్ధన్, ఎంపీవో రాజకిరణ్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహారెడ్డి, ఎంఇవో సెత్ల, ప్రిన్సిపాల్ అమర్ సింగ్, పిడి వెంకటేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో

క్రీడలు మానసిక శారీరక ఉత్సాహానికి దోహదం

దోమకొండ: యువత మానసిక శారీరక ఉత్సాహానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఎంపిపి కానుగంటి శారద తెలిపారు. దోమకొండ మండల కేంద్రం లో సోమవారం సియం కప్ 2023లో భాగంగా మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను జడ్పిటిసి తీగల తిర్మల్ గౌడ్ గారితో కలిసి ఆమె ప్రారంబించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎస్ఐ సుధాకర్, ఎంపిఓ తిరుపతి, వైస్ ఎంపిపి బాపురెడ్డి, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, మాజీ ఏ ఏం సి చైర్మన్ కుంచాల శేఖర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలు ప్రారంభం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసాని పెట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి మాధవి, మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ సిఎం కప్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషగౌడ్, మున్సిపల్ కమిషనర్ జీవన్, ఎంఈఓ, ఎంపిఓ ప్రకాష్, తహశీల్దార్, స్థానిక కౌన్సిలర్లు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో

క్రీడా పోటీలు ప్రారంభం

తాద్వాయి: తాద్వాయి మండల కేంద్రంలో సోమవారం ప్రతినిధులు సీఎం కప్ క్రీడలు ప్రారంభించారు. ఈ క్రీడల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొని ఆహ్లాదంగా గడిపే అవకాశం ఉంటుందన్నారు. యువకులకు క్రీడలు స్నేహ సంబంధాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొడి రవి, వైస్ ఎంపీపీ నర్సింలు, జడ్పిటిసి రమాదేవి నారాయణ, గ్రామ సర్పంచ్ సంజీవులు, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయి రెడ్డి, రైతు బంధు అధ్యక్షులు రామ్ రెడ్డి ఎంపీడీవో రాజ్వీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి: డీఈవో రాజు

రామారెడ్డి : మండల కేంద్రంలో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం వేసవి స్పోర్ట్స్, సీఎం కప్ 2023 ఆటలను స్థానిక ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో రాజు మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత యువకులకు క్రీడలతో స్నేహాన్ని పెంపొందించాలని ఉద్దేశంతో పాటు, శారీరకంగా, మానసికంగా అభివద్ధి చెందాలని ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ గ్రామీణ ప్రాంత యువకుల కోసం ఈ ఆటలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దండబోయిన సంజీవ్, ఎస్సై అనిల్, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజా గౌడ్, వివిధ గ్రామాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


నసురుల్లాబద్‌లో


తాద్వాయిలో


సదాశివనగర్‌లో


రామారెడ్డిలో..

లారీల కొరత తీర్చాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని వరి కొనుగోలు కేంద్రాల్లో లారీల సమస్య తీర్చాలని టిజెఎస్ నాయకులు నిజ్జన రమేష్ కోరారు. స్థానిక ఆర్డీఓకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లారెడ్డి మండల మల్లయ్యపల్లి గ్రామంలో రైతులు కొనుగోలు కేంద్రానికి వడ్లు తెచ్చి నెల రోజులు గడుస్తుందని సరియైన సమయానికి లారీలు రావడం లేదని, వడ్లు కాంట జరగడం లేదని, ఇప్పటికే వర్షాల వలన కొనుగోలు కేంద్రంలో వడ్లు మొలకలు వచ్చాయని తెలిపారు. చెన్ని పట్టిన తర్వాత కూడా 2 కిలోలు తరుగు తీస్తున్నారని, రైస్ మిల్లుల దగ్గరకు వెళ్లిన తర్వాత ప్రతి లారీ ఖాళీ చేసేటప్పుడు 4 క్వింటాలు తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారం చేయకపోతే రైతులతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, పూల్ సింగ్ నాయక్, రైతులు కామ ఆశయ్య, తోట రమేష్, మహేష్, మహేందర్, పైథారి రమేష్ పాల్గొన్నారు.

మారుమూల ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మారుమూల గ్రామాలు, తండాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ దశరథ్ రెడ్డి అన్నారు. మండలంలోని స్కూల్ తాండ గ్రామపంచాయతీ పరిధిలో, స్కూల్ తండా నుండి బట్టు తాండ రోడ్డు వరకు రూ, కోటి 65 లక్షలతో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీపీ దశరథ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ లలితా బుచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా తాండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి, తండాల్లో అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు రాజా గౌడ్, బట్టు తండా సర్పంచ్ రెడ్డి నాయక్, బి ఆర్ ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, యూత్ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, చంద్రు నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభం


భూమిపూజ చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలం నేరల్ తండాలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించ తలపెట్టిన హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను ఎంపీపీ రాధాబలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్‌తో కలసి సర్పంచ్ కమోది బాయి చందానాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యం రావు, ఎంపీడీఓ సతీష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి రాజులు, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శివాజీ రావు, ఉపసర్పంచ్ బస్సి నర్సింగ్, నేరల్ మాజీ సర్పంచ్ బస్సి ప్రకాష్ , సొసైటీ డైరెక్టర్ నెహ్రూ, నాయకులు బిచ్చం నాయక్, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం


రిబ్బన్ కట్ చేసి శిబిరానజ్ని ప్రారంభిస్తున్న

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్వాయిలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొత్తొళ్ళ గంగారం, మండల రైతు బంధు అధ్యక్షులు గురజాల నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారం మాట్లాడుతూ.. ప్రభుత్వం మారుమూల గ్రామాల్లో కూడా వైద్యం అందాలని లక్ష్యంతో ప్రతి ఒక్కరి కంటి చూపు కోసం గ్రామాలలోని వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమాదేవి దత్తాత్రేయ, ఉప సర్పంచ్ సరస్వతి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైద్యులు సురేష్, వైద్య సిబ్బంది భీం, తదితరులు పాల్గొన్నారు.

రామ్‌లాల్ చూపిన బాటలో నడవాలి

- ఎమ్మెల్యే సురేందర్

నవతెలంగాణ-తాద్వాయి

మహారాజు రామ్‌లాల్ సేవలాల్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ తెలిపారు. తాడ్వాయి మండలం నందివాడ పల్లెగడ్డ పీరుమయకుంట తండాలో ఆయన సోమవారం రామ్‌లాల్ సేవలాల్ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్లాల్ సేవలల్ మహారాజు గురూజీ సమాజ సేవకు నిరంతరంగా కృషి చేశారని తెలిపారు. నీతి, ధర్మం, అహింసా మార్గంలో నడుచుకోవాలని రామ్‌లాల్ హితబోధ చేశాడని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్రజాసేవలో పాల్గొని పదిమందికి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమిని, డిసిఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాయి రెడ్డి, నాయకులు గోపాల్ రావు, రామ్ రెడ్డి ,రాజు గౌడ్ ,గంగారం, రూప్ సింగ్, గురు నాయక్, బాబు సింగ్ తదితల్ పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

బహుమతి నగదు ఆలయానికి విరాళం

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని శ్రీ రేణుకా మాత ఆలయానికి జిల్లా కేంద్రంలోని ఆర్యభట్ట జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ ఫైండర్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో పట్టణంలోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బుర్ల రుషికేష్ మొదటి స్థానం సాధించినందుకు గాను 5000 రూపాయల నగదు బహుమతి అందజేశారు. తనకు వచ్చిన 5000 రూపాయల నగదు బహుమతిని రేణుకా మాత ఆలయ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రుషికేశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగభూషణం గౌడ్, సిద్ధ గౌడ్, వెంకట్ గౌడ్, స్వామి గౌడ్, రామా గౌడ్, రేణు కుమార్, రోహన్, కార్తీక్, గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు


నగదును అందజేసుతన్న రిషికేష్

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

నవతెలంగాణ-జుక్కల్

ప్రమాదవశాత్తు అతివేగంగా వెళ్తు అదుపుతప్పి బైక్ లోయలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని డోన్గాం రోడ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. జుక్కల్ ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం ఔరాద్ తాలుకా తేగమ్ పూర్ గ్రామానికి చెందిన బాబురావ్ (40) పడంపల్లి గ్రామంలో బంధువుల ఇంటికి పెళ్లికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో డోన్గాం కొళ్ల ఫారం వద్ద బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలో పడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ముఖ్యంగా తలకు హెల్మెట్ లేక పోవడం వలన మృతి చెందాడు. ఒక వేళ హెల్మెట్ ఉంటే బతికే వాడని పోలీసులు తెలిపారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్టుతెలిపారు


మృతిచెందిన బాబురావు

పోలీస్‌స్టేషన్‌కు 4 సీసీ కెమెరాల వితరణ


సీసీ కెమెరాలు అందజేత

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గాంధారి ఎస్సై సుధాకర్ సూచన మేరకు గాంధారి లోని జ్యోతి హాస్పిటల్ యాజమాన్యం సురేందర్, డాక్టర్లు రాథోడ్ ప్రకాష్, రాథోడ్ జ్యోతిలు కలిసి 4 సీసీకెమెరాలు వితరణ ఇవ్వడం జరిగింది అని ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమరాలు ఏర్పాటు చేయడం వల్ల పారదర్శకంగా పనిచేయడం జరుగుతుంది అని ఆయన అన్నారు. సీసీ కెమెరాలువితరణ ఇచ్చిన డాక్టర్లను ఎస్సై అబినందిచారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. మండలంలోనిఅన్నిగ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు

వీఆర్ఏల నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన కార్యవర్గం

నవతెలంగాణ-ఆర్మూర్

వీఆర్ఏల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీఆర్ఏల మండల సర్వసభ్య సమావేశం సోమవారం పట్టణ తహసిల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.మోహన్, ఉపాధ్యక్షునిగా.ఎన్.ప్రశాంత్, కార్యదర్శిగా జి. మారుతి, సంయుక్త కార్యదర్శిగా.డి. గంగాధర్, కోశాధికారిగా ఎ. నరేందర్, సలహాదారులు.ఎస్.గంగాధర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సభ్యులు గంగాధర్, కిషోర్, భాజన్న, పోశన్న తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు ఘనసన్మానం

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని బోర్గాం గ్రామ పాలకవర్గ సభ్యులు దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘనంగా సన్మానం చేశారు. సోమవారం బోర్గం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ పార్థ వాణి సాయి రెడ్డి, సర్పంచి ఫిరోజ్ ఉద్దీన్ సమక్షంలో అవార్డు గ్రహీతలు రవికుమార్, రొడ్డలింగం, సిద్ధ సాయిలను సన్మానించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు కార్తీక్, క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్వక్, సాయి రెడ్డి, పార్ధ రాజు, కురుమే సాయిలు, గ్రామ కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి పంచాలి

- జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు మరోసారి విజ్ఞాపన పత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి పంచాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ కి మరోసారి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ నెల 2న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షులు మహిపాల్ మహారాజ్ ఆధ్వర్యంలో మళ్లీ వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ నాయకులు సుమన్ మహారాజ్, ప్రేమ్ మహారాజ్, జిల్లా డిఎస్‌పి పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ మహారాజ్, వివిధ మండలాల డిఎస్‌పి అధ్యక్షులు రాజేశ్వర్ మహారాజ్, కైలాష్ మహారాజ్, మహేష్ మహారాజ్, ప్రశాంత్ మహారాజ్, మహేష్ మహారాజ్ పాల్గొన్నారు.

క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాపోటీలు

- చీఫ్ మినిస్టర్ కప్ మండల స్థాయి పోటీలు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు

చీఫ్ మినిస్టర్ కప్ -2023 మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉన్న క్రీడ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, పోటీల్లో మండలంలోని యువకులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..



ధర్పల్లిలో..



రెంజల్‌లో..

నవతెలంగాణ-విలేకరులు

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ మండలస్థాయి పోటీలను ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రీడల్లో రాణించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు అన్నారు. అనంతరం ఎంపీడీఓ సంతోష్ రెడ్డి, సర్పంచ్ సక్కరం అశోక్ తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తోట జ్యోతి మనోహర్, మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, నర్సాపూర్ సర్పంచ్ పెండే ప్రభాకర్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యనంద్, బిఆర్ఎస్ నాయకులు జీపీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఎడపల్లి: క్రీడాపోటీల్లో గెలుపు ఓటమి సహజమేనని ఓటమిని గెలుపునకు నాందిగా భావించి సోదర భావంతో పాల్గొనాలని ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ప్రజాప్రతినిధులు అధికారులు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. వాలీబాల్ పోటీల్లో ఎడపల్లి వర్సెస్ జైథాపూర్ జట్లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకష్ణ, తహసిల్దార్ ఆకుల శేఖర్, మండల విద్యాశాఖ అధికారి రామారావు, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, తానా కలన్ సర్పంచ్ పాల్ల భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రెంజల్: సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్, ఎంపీడీవో శంకర్ క్రీడాపోటీలను ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల లోపు యువతకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలతో పాటు, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఫిక్, ఎంపీ ఓ గౌసుద్దీన్, గ్రామ కార్యదర్శి రాఘవేంద్రరావు, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్కాల్: సీఎం కప్ 2023 క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ-వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో క్రీడోత్సవాలను తోటి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ నెల 17 వరకు పోటీలు జరుగుతాయని అన్నారు. జడ్పీటీసీ సభ్యులు బద్దం-నర్సారెడ్డి మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్ పోటీలను చేపట్టడం జరుగుతుందన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేయడం జరుగుతుందని, ప్రతిభ చూపిన యువతి యువకులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, కో-ఆప్షన్ సభ్యులు మునిరోద్దీన్, ఉప సర్పంచ్ బ్రమ్మదండి సువర్ణ, ఎంపీడీవో దామోదర్, తహశీల్దార్ పి.శ్రీకాంత్, ఏఎస్సై గంగారాం, పంచాయితీ సెక్రటరీ విజయ్ కుమార్, ఆర్ఐ గంగారాం, కబడ్డీ గంగాధర్, టి.సాయన్న, రెంజర్ల సర్పంచ్ ఆకుల రాజారెడ్డి, నల్లూర్ ఎంపీటీసీ సత్యనారాయణ, గ్రామాభివద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిల్క రఘు, గడ్డల సాయిలు, యువజన సంఘం నాయకులు చిల్క దినేష్, నవీన్, గంగరాజ్, రాకేష్, సాయిలు, ఇలియస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు..

ఆర్మూర్: ఆలూర్ మండలస్థాయి చీఫ్ మినిస్టర్స్ కప్ పోటీలు మండల పరిషత్ అధ్యక్షులు పస్కా నర్సయ్య, మండల పరిషత్ అధ్యక్షులు మస్త ప్రభాకర్, ఆలూర్ గ్రామ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఆలూర్ మైనారిటీ కాలేజ్ క్రీడా ప్రాంగణంలో ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వెంటనే పేర్లను నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు శ్రీనివాస్, దత్తాత్రి, క్రాంతి, ఎంఈఓ రాజా గంగారాం, జడ్పిటిసి మెట్టు సంతోష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: సీఎం కప్ పోటీలను డిచ్ పల్లి మండలంలోని ఖిల్లా డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామాల్లో జడ్పిఎస్ఎస్‌లో ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఎంపిడివో రాములు నాయక్, తహసిల్దార్లు శ్రీనివాస్ రావు, గోపి బాబు, టివి రోజా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చిలివెరి గంగా దాస్, ఎంపివో రాజ్ కాంత్ రావు, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొనవచ్చాని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ గోపి బాబు, ఎంపివో నిట్టు కిషన్ రావు, పంచాయతీ కార్యదర్శులు, పిఈటీలు పాల్గొన్నారు.

ధర్పల్లి: టాలెంట్ అనేది ఏఒక్కరి సొత్తుకాదని జడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. మండలకేంద్రములోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ క్రీడలను మండల ఆటల కమిటీ చైర్మెన్ ఎంపీపీ నల్ల సారికతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గెలుపొందిన జట్లకు ప్రశంసాపత్రంతోపాటు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. గ్రామ యువత ఆటల్లో ముందుకు రావాలని, అవసరమున్నవారికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమములో ఎంపిడిఓ నటరాజ్, తహసీల్దార్ గంగాసాగర్, ఎస్ఐ వంశీ కష్ణ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్, సొసైటీ చైర్మెన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది సంవత్సరాలు అయిన సందర్భంగా గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడానికి చీఫ్ మినిస్టర్ కప్ క్రీడా పోటీల ప్రారంభించారు. క్రీడాకారులను ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి పరిచయం చేసుకొని వారిలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, తాసిల్దార్ శ్రీకాంత్ రావు, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, పోతంగల్ సర్పంచ్ శంకర్, పిఇటిలు సాయిబాబా, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడలను జెడ్పీటీసీ బొల్లెంక సుమలత రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో మల్లేష్, సర్పంచ్ నాగేష్, టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మధుకర్ రావు, మండల నాయకులు సుధాకర్ గౌడ్, శంకర్, లక్ష్మణ్, క్రీడలను ప్రారంభించారు కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కాందారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బోధన్: క్రీడలవల్ల శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుద్దే సావిత్రి రాజేశ్వర్, జెడ్పిటిసి గిర్దావర్ లక్ష్మీ గంగారెడ్డి, డిసిసిబి డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ షకీల్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ కమిటీ చైర్మన్ బుద్దే రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఎంపీడీఓ పర్బన్న, సాలూర తహశీల్దార్ మమత పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల అవరణంలో మండల స్థాయి సిఎం కప్ క్రీడలను ఎంపిపి మస్త ప్రభాకర్ అధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు సోమవారం ప్రారంభించారు. అమ్రాద్, మెట్టు, సింగంపల్లి తండా , మాదాపూర్, మాక్లూర్ జట్లు పాల్గొన్నాయి. విన్నర్‌గా అమ్రాద్ తండా, రన్నర్‌గా సింగాంపల్లి తండా జట్టు గెలుపొందయి. వేసవి దష్ట్యా మంగళవారం ఉదయం 6.30 నుండి 11 గంటల వరకు పోటీలు నిర్వహించబడుతుందని మండల విద్యాశాఖ అధికారి రాజ్ గంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ క్రాంతి, ఎస్సై యాదగిరి గౌడ్ పిడి నాగమణి, డిటి భాస్కర్, పి ఇ టి లు పాల్గొన్నారు.

మోపాల్: మోపాల్ జడ్పిహెచ్ఎస్ స్కూల్లో ఎంపీపీ లత, తహసీల్దార్ లత, జెడ్పిటిసి కమలా నరేష్, ఎంపీడీవో లింగం ఎస్సై మహేష్, సర్పంచులు ముత్యం రెడ్డి, సతీష్ రెడ్డి ఇందూరి సిద్ధార్థ, వార్డ్ మెంబర్స్ ప్రారంభించారు. క్రీడలను జిల్లా క్రీడా కమిటీ ఒలంపిక్స్ సంఘం సభ్యులు పరిశీలిస్తారని అన్నారు



నిజామాబాద్ రూరల్‌లో..



ముప్కాల్‌లో..



బోధన్‌లో..



డిచ్‌పల్లి: ఇందల్‌వాయిలో

తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన గంగపుత్రులు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న గంగపుత్రులు

నవతెలంగాణ-ముప్కాల్

తహసీల్దార్‌గా మూడు రోజుల కిందట పి.శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా

గంగపుత్ర సంఘం మండల ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ గంగపుత్రులు వృత్తిని దైవంగా భావించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగ పరుచుకోవాలని అన్నారు. దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు సట్టి సాయన్న ఆధ్వర్యంలో తహశీల్దార్‌ను కలిశారు. మరోవైపు రేషన్ డీలర్లు సైతం కలిసిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర జిల్లా కార్యదర్శి సౌన్ పెట్ నారాయణ, రాష్ట్ర సలహాదారు ఎర్ర నారాయణ, ఆయా గ్రామాల అధ్యక్షులు ఎర్ర భానుకృష్ణ, నర్సయ్య, బంటు రాజేశ్వర్, రేషన్ డీలర్లు కుమ్మరి రవి, బ్రమ్మదండి కమలాకర్, నర్సింగ్ దాస్, తిరుపతి, రాజేశ్వర్, దివ్యంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు గోపు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఇప్ప రాధ తదితరులు ఉన్నారు.

గల్ఫ్‌లో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- కోటపాటిని ఆశ్రయించిన కుటుంబ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

సిరికొండ మండలం తాళ్లరామడుగు గ్రామ యువకుడు సయ్యద్ యూనుస్ (24) సంవత్సరాలు ఉపాధి కోసం ఖత్తర్ దేశం వెళ్లి డ్యూటీలో భాగంగా మోటర్ సైకిల్ పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఆదివారం ప్రాణాలు కోల్పోయాడు. సిరికొండ మండలం గల్ఫ్ కార్మిక సంఘం అధ్యక్షులు మహేందర్ యాదవ్ నేతృత్వంలో కుటుంబ సభ్యులు సోమవారం పట్టణానికి వచ్చి ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడును కలిశారు. మృతదేహాన్ని త్వరగా రప్పించాల్సిందిగా వేడుకున్నారు కోటపాటి స్పందించి కత్తర్లోని ఇండియన్ ఎంబసి అధికారులకు టిజిఎస్ నాయకులు శంకర్ గౌడ్, జి రాజుకు సమాచారం అందించారు. యూనుస్ మృతి దేహాన్ని త్వరగా ఇండియాకు పంపి ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చే విధంగా చూడాలని కోరారు,

సీనియర్ సిటిజన్ సంఘ భవనానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్, జడ్పీటీసీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ లో సోమవారం సీనియర్ సిటిజన్ సంఘ భవన నిర్మాణానికి సర్పంచి మానేటి తులసి నాగభూషణం, జడ్పీటీసీ దాసరి వెంకటేష్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మంత్రి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేక చొరువ తీసుకొని సీనియర్ సిటిజన్ సంఘ భవనానికి రూ.5 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ఎంపీటీసీ రాం రాజ్ గౌడ్, ఉపసర్పంచి చింపు శ్రీనివాస్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎంబరి శరత్, స్వామి నాథ్, సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు మనోహర్, సభ్యులు దేవారెడ్డి, తుకారం, మల్లయ్య, నాగేశ్వరరావు, రాంచందర్ పాల్గొన్నారు

దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన నీరడి రవికుమార్‌కు బాబు జగ్జీవన్ రావ్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డు రావడంతో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కేకేసి జిల్లా డివిజన్ మండల కోఆర్డినేటర్లు సోమవారం మండలకేంద్రంలోని బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కెప్టెన్ కరుణాకర్ రెడ్డి నివాస ఆవరణంలో కేకేసి బోధన్ కోఆర్డినేటర్ బుడ్డ పోశెట్టి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. రవికుమార్ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ప్రతిభ చూపడమే కాకుండా తనకు తోచిన కాడికి ఆర్థిక సాయం చేయడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు దళిత రత్న అవార్డును అందజేశారు. కార్యక్రమంలో కేకేసి బోధన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బుడ్డ పోశెట్టి, నాయకులు రాజశేఖర్, సున్నపుఒడ్డెన్న, పరువయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాసపురం సాయిలు, సరీదాస్, కాజాఫాయెజొద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

మరో 3 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరిగిపోతుంది. ఆదివారం 42.5/26.8 ఉష్ణోగ్రత నమోదు కాగా సోమవారం 41.9/29.5 ఉష్ణోగ్రత నమోదయిందని నిజామాబాద్ వాతావరణ శాఖ అధికారి ప్రతాప్ తెలిపారు. మరో మూడు రోజుల్లో సుమారు 45 డిగ్రీల నుండి 46 డిగ్రీల అత్యధికంగా ఉష్ణోగ్రత నగరంలో నమోదయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఉదయం 11 నుండి సాయంత్రం 4 వరకు బయటకు వెళ్లొద్దని హెచ్చరించారు. బయటకు వెళ్లి వడదెబ్బ బారిన పడకుండా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు ప్రజలకు సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అశోక్‌సాగర్ వద్ద ఫీడర్ పైప్‌లైన్ లీకేజీ

- నేడు కొన్ని ప్రాంతాలలో తాగునీటి సరఫరా ఉండదు

నవతెలంగాణ-కంఠేశ్వర్



లీకేజీ అవుతున్న నీరు

అశోక్ సాగర్ వద్ద ఫీడర్ పైపు లైనుకు ఏర్పడిన లీకేజీ కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరా ఉండదని నిజామాబాద్ మున్సిపల్ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్ నగర్, నాందేవ్ వాడ, గంగస్థాన్, హమాల్వాడి, దుబ్బ, గౌతం నగర్, కంఠేశ్వర్, చంద్ర శేకర్ కాలనీ, ఎల్లమ్మగుట్ట, పోచమ్మ గల్లి, గోల్ హనుమాన్, అర్సపల్లి, మాలపల్లి, అహ్మద్ పుర కాలనీ, హబీబ్ నగర్‌లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని మున్సిపల్ శాఖ అధికారులు కోరారు.

విధుల్లో చేరిన జూనియర్ పంచాయతీ సెక్రటరీలు

నవతెలంగాణ-ముప్కాల్

గత కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీ సెక్రటరీలు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి డెడ్ లైన్ విధించడంతో సమ్మెలో పాల్గొన్న జూనియర్ సెక్రటరీలు మండల ప్రజపరిషత్ కార్యాలయంలో రిపోర్ట్ చేసి విధుల్లో చేరినట్లు ఎంపీవో భరత్ చంద్ర తెలిపారు.

ప్రజలకు అందుబాటులో హాస్పిటల్ ఏర్పాటు అభినందనీయం

- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



ఆస్పత్రిని ప్రారంభించిన రాజేశ్వర్‌రెడ్డి,

ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో లక్ష్మి హాస్పిటల్‌ను సోమవారం ఆశన్నగారి రాజేశ్వర్ రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఆలూర్ మండలంలోని తొలి పెద్ద హాస్పిటల్ లక్ష్మీ హాస్పిటల్ అని, దీనిని చుట్టుపక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని తెలిపారు. ఎమర్జెన్సీ కేసు ఉంటే దూర ప్రాంతాలకు వెళ్లే లోపే ప్రాణాలు కోల్పోతున్నారని, ఆలూర్ ప్రాంతంలోనే లక్ష్మీ హాస్పిటల్ అందుబాటులో ఉందని అన్నారు. లక్ష్మీ హాస్పిటల్ డాక్టర్ మాట్లాడుతూ పాముకాటుకుగాని పాయిజన్ తాగిన ఎమర్జెన్సీ కేసు ఎటువంటిదైనా చికిత్స అందిస్తామని చెప్పారు. ప్రతి ఆదివారం షుగర్ టెస్ట్ ఉచితంగా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ కల్లెం మోహన్ రెడ్డి, జడ్పిటిసి మెట్టు సంతోష్, ఆర్మూర్ ఎంపీపీ పస్కా నర్సయ్య, ఉప సర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్ష్మి మల్లేష్, సొసైటీ చైర్మన్ కల్లెం భోజరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ భోజకళ్ల చిన్నారెడ్డి,మెడికల్ ఆఫీసర్ బండి గోపీచంద్, కన్సలెంట్ డాక్టర్ నాగేష్, మేనేజ్మెంట్ నాగ నరేష్, హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

రోజు కూలి 600 రూపాయలు ఇవ్వాలి

- ఉపాధి కూలీలకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలి
- ఏఐపికెఎంఎస్
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకష్ణ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి కూలీకి యేటా 200 రోజులు పని దినాలు కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజు కూలి 600 రూపాయలు చెల్లించి, కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఉపాధి కూలీల సమస్యలపై జరిగిన ధర్నాకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐపికెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.గంగాధర్, జిల్లా అధ్యక్షులు సిహెచ్ సాయి గౌడ్, ప్రధాన కార్యదర్శి జి.కిషన్ లు మాట్లాడుతూ.... ఉపాధి పనిని మెల్లమెల్లగా తొలగించే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ పథకానికి 2023-24 బడ్జెట్ తగ్గించిదని ఎద్దేవా చేశారు. ఉపాధి కూలీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి నిర్లక్ష్య ధోరణి విడనాడి వ్యవ సాయ కూలీ లను ఆదుకోవాలని కోరారు. 2023 -24 సంవత్సరంలో కూలీల డిమాండ్ కు తగ్గట్టుగా 2 లక్షల 75 వేల కోట్ల రూపాయల కేటాయించాలని ప్రభుత్వాన్ని ఏఐపికెఎంఎస్ పెండింగ్లో ఉన్న బకాయిలన్నింటినీ వెంటనే కూలీలకు ఇవ్వాలని, పనిముట్లు, టెంట్లు, మంచినీళ్ల సౌకర్యం, పని స్థలానికి ఆటో సౌకర్యం కల్పించాలన, ప్రమాద బీమా 50 లక్షల రూపాయలు ఇవ్వాలని, ప్రతి కూలీకి 200 రోజుల పని దినాలు కల్పించాలని అన్నారు. కూలీలకు ఐడి కార్డులు ఇవ్వాలని, ఉపాధి కూలీలకు ప్రభుత్వమే స్థలం కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, 57 సంవత్సరాలు దాటిన కూలీలకు నెలకు 10వేల జీవనభతి ఇవ్వాలనని, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పి రాజేశ్వర్, సహాయ కార్యదర్శి నజీర్, కోశాధికారి బి అశోక్, నాయకులు ఈ రమేష్, పెద్దన్న అని కట్ట రాములు, తదితరులు పాల్గొన్నారు.